అరాచక శక్తులను సహించం

- ఇవే నా చివరి ఎన్నికలు.. ఇక ఎన్నికల్లో పోటీ చేయను
- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఎంపీ ఆదాలను ఆశీర్వదిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలో అరాచక శక్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించనని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. రూరల్ నియోజకవర్గంలోని 23వ డివిజన్‌కు సంబంధించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని ఆ డివిజన్ కార్పొరేటర్ ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఎంపీ ఆదాల కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ తాను ఎక్కడున్నా అభివృద్ధిని మాత్రమే కాంక్షిస్తానని పేర్కొన్నారు. తాను ధర్మాన్ని మాత్రమే పాటిస్తానని, అధర్మానికి తన వద్ద చోటు లేదని స్పష్టం చేశారు. తనకు ఇవే చివరి ఎన్నికలు అని, ఇక ఎన్నికల్లో పోటీ చేయనని మీ అందరి సహాయ సహకారాలతో ఎమ్మెల్యేగా గెలిచి మంచి చేసి చిరస్థాయిగా నెల్లూరు రూరల్ ప్రజల గుండెల్లో నిలిచిపోవడమే తన జీవిత లక్ష్యమన్నారు. 50 రోజులు కష్టపడి పార్టీ కార్యకర్తలు తనను గెలిపిస్తే ఐదేళ్లపాటు మిమ్మల్ని తన కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. తొలుత క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఎంపీ ఆదాల ఘన విజయం సాధించాలని ఆశీర్వదించారు. ఈ సమావేశంలో నగర మేయర్ పీ స్రవంతి జయవర్ధన్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, క్లస్టర్–2 అధ్యక్షులు పాతపాటి పుల్లారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు లేబూరు పరమేశ్వర్‌రెడ్డి, 23వ డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల పల్లకిసేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేషాషేకాలు, పూజలు చేశారు. శ్రీవారి ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

గుమ్మలదిబ్బలో అధికారుల తనిఖీలు



కోవూరు : మండలంలోని గుమ్మలదిబ్బ గ్రామంలో పశుసంవర్ధక శాఖ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. ఇటీవల గ్రామంలో బర్డ్‌ఫ్లూ రావడంతో దాదాపు 400పైగా కోళ్లను ఖననం చేశారు. ఇంకా ఏమైనా కోళ్లు ఉన్నాయా అని తెలుసుకునేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు బృందంగా ఏర్పడి మరోసారి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేపట్టారు. మూడు నెలల పాటు చికెన్, కోడిగుడ్లకు దూరంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

సరోజినీనాయుడికి ఘన నివాళి



ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి సరోజినీ నాయుడి వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆమె సేవలు అభినందనీయమన్నారు. మహిళలకు విద్య అవసరమని దేశమంతా తిరిగి సమావేశాలు ఏర్పాటు చేసి చైతన్యం తీసుకొచ్చారని వివరించారు. తొలుత ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం దయాకర్‌రెడ్డితో కలిసి ఆశ్రమ ఆవరణలోని గాంధీజీ, స్థల దాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అపోహలొద్దు



మనుబోలు : ఈవీఎంలపై ఎలాంటి అపోహలు వద్దని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ, ఈవీఎంల ట్రైనర్ రవికుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొలనకుదురు, కట్టువపల్లి, బద్దెవోలు, పిడూరుపాళెం, వెంకన్నపాళెం గ్రామాల్లో ఈవీఎంలపై శనివారం అవగాహన కల్పించారు. ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలి, ఏ బటన్ నొక్కితే ఏ గుర్తు పడుతుంది.. తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈవీఎం ద్వారా ఓటు వేస్తే ఒకే గుర్తుకు ఓటు పడుతుందనే అపోహలు ప్రచారంలో ఉన్నాయని, అది వాస్తవం కాదని తెలిపారు. అనంతరం ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో వీఆర్వోలు భగవాన్, నాగేశ్వరరావు, వీఆర్ఏ రమేష్, బీఎల్‌ఓలు నరేష్, సురేష్, మురళీకృష్ణ, యాసర్, బాబురావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ల నియామకం

మనుబోలు : మండలంలోని మనుబోలు–1, మడమనూరు, చెరుకుమూడి గ్రామాల్లో ముగ్గురు పశుసంవర్ధక సహాయకులను ప్రభుత్వం నియమించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసాద్‌కు నియామక పత్రాలు అందజేసి వారు శనివారం బాధ్యతలు చేపట్టారు. మనుబోలు–1కు ఎస్.ఎం.నివేదిత, మడమనూరుకు కె.కామాక్షమ్మ, చెరుకుమూడికి కె.కల్యాణి నియమితులయ్యారు.

పొదుపు మహిళల సర్వసభ్య సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పొదుపు మహిళల సర్వసభ్య సమావేశం నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడారు. పొదుపు గ్రూపులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తానని వివరించారు.

నేత్రపర్వంగా ఉమామహేశ్వరుల పల్లకిసేవ



నెల్లూరు(బృందావనం): నగరంలోని సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు రామావఝుల శ్రీనివాసులుశర్మ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి ఆదిదంపతులను విశేషంగా అలంకరించి పల్లకిసేవ జరిపారు. శ్రీరాజరాజేశ్వరి నృత్యనికేతన్‌కు చెందిన వేదాంతం విధుమౌళి శిష్య బృందం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో అలరించారు. భక్తులు విశేషంగా హాజరై దేవదేవేరులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా డీవీఎస్ గిరి, పద్మజ దంపతులు వ్యవహరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు ఎస్సీ బాలాజిసింగ్, జీసీ ధర్మసింగ్, కార్యనిర్వహణాధికారి బొగ్గల మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు.

సంక్షేమ పాలనకు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

- నగర నియోజకవర్గ సమన్వయకర్త ఎండీ ఖలీల్‌అహ్మద్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలని నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త , డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్ కోరారు. నగరంలోని 47వ డివిజన్ కుక్కలగుంట, కామాటివీధి, తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ నగర నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని వివరించారు. 47వ డివిజన్ చుట్టుపక్కల ప్రాంతాల వారి కోసం నిర్మిస్తున్న కర్మక్రతువుల భవనం దాదాపు పూర్తయిందని, త్వరలో ప్రారంభిస్తామన్నారు. కామాటి వీధిలో దాదాపు 30 ఏళ్ల తరువాత సిమెంటురోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తూ ముందుకెళుతున్నామన్నారు. నగర ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నగర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న తనను ఆశీర్వదించాలని కోరారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని నియమించడం సంతోషకరమన్నారు. ఆయన నియామకంతో పార్టీ శ్రేణులకు కొండంత ధైర్యం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ ఆచారి,, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవస్థాప మనస్తత్వ అభివృద్ధిపై పోటీలు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

నెల్లూరు (టౌన్): పొదలకూరురోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యవస్థాప మనస్తత్వ అభివృద్ధిపై జిల్లా స్థాయి పోటీలను శనివారం నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు పలు నమూనా ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. అందులో పది ఉత్తమ ప్రాజెక్టులను అధికారులు ఎంపిక చేశారు. వాటిలో లింగసముద్రం ఏపీఆర్‌డబ్ల్యూఎస్ విద్యార్థులు కవిత, సుస్మా, లక్ష్మీప్రసన్న రూపొందించిన రీయూజింగ్ వేస్ట్ క్లాత్స్ అండ్ ఎకో ఫ్రెండ్లీ పెన్స్ ప్రథమ స్థానం, కావలి మండలం ముసునూరు జిల్లా పరిషత్ కేహెచ్‌బీఆర్ విద్యార్థులు శ్రీజ, గాయత్రి, నిరూప రూపొందించిన పేపరు రీసైక్లింగ్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ప్రాజెక్ట్ ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్, అఫ్లటూన్ ఇంటర్నేషనల్, రీప్ బెనిఫిట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో డీఈఓ రామారావు, ఈఎండీపీ మేనేజర్ అనిత, కందుకూరు, నెల్లూరు, కావలి డిప్యూటీ ఈఓలు శ్రీనివాసులు, ప్రసన్నలక్ష్మి, రఘురామయ్య, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, స్కూల్ హెచ్ఎం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైకి పశువులను వదిలితే చర్యలు



పశువుల యజమానులతో మాట్లాడుతున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): నగరంలోని రోడ్ల మీదకు పశువులను వదిలితే చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌ఓ వెంకటరమణ పశువుల యజమానులను హెచ్చరించారు. నగరంలోని ప్రధాన రోడ్లపై ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారిన పశువులను గోశాలకు తరలించే స్పెషల్ డ్రైవ్‌ను రెండోరోజు పరమేశ్వరినగర్, సంతపేట ప్రాంతాల్లో శనివారం చేపట్టారు. రోడ్లపై సంచరిస్తున్న పశువులను పాత మున్సిపల్ కార్యాలయం వద్దకు తీసుకొచ్చి కల్లూరుపల్లి గోశాలకు తరలిస్తున్న క్రమంలో పశువుల పెంపకందారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ పశువుల పెంపకందారులతో మాట్లాడారు. రోడ్లపై సంచరిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నగర మేయర్, కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం సహకారంతో గోశాలకు తరలించి సంరక్షిస్తామన్నారు. పశువులను ఇళ్ల ప్రాంగణంలోనే ఉంచుకుని పోషించుకోవాలని, రోడ్లపైకి వదిలితే తప్పనిసరిగా గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహ అధికారులపై చర్యలు తీసుకోవాలి



నెల్లూరు (టౌన్): జిల్లాలోని వెనుకబడిన తరగతుల వసతిగృహాలను గాలికి వదిలివేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విద్యార్థి సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహ అధికారుల అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా వారు తప్పులు సరిదిద్దుకోకుండా మీడియా, విద్యార్థి, ప్రజాసంఘాలపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బోగస్ అడ్మిషన్లతో వసతిగృహ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వసతి గృహాల్లో జరుగుతున్న అక్రమాలపై కలెక్టర్ విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్రాధ్యక్షుడు చైతన్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మస్తాన్, ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి త్రినాథ్, బీవీఐఎస్ రాష్ట్రాధ్యక్షుడు వెంకట్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాజా, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సునీల్, ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా, డీఎస్ఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు చంద్ర, పీఎస్‌యూ రాష్ట్ర సభ్యులు హరిరెడ్డి, విద్యార్థి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఆదిత్యసాయి పాల్గొన్నారు.

కృష్ణచైతన్యలో యూత్ పార్లమెంట్



నెల్లూరు (టౌన్): నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నైబర్‌ఉడ్ యూత్ పార్లమెంట్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు మాక్ పార్లమెంట్ నిర్వహించి పార్లమెంట్ కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వీఎస్‌యూ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశ రాజకీయాలపై యువతకు అవగాహన ఉండాలన్నారు. దేశ భవిష్యత్తు యువత మీద ఆధారపడి ఉందని, యువత బాధ్యతయుతంగా ప్రవర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీడ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయిసూరి, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటప్పయ్య, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, యువజన అధికారి మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

నారాయణలో అరుదైన థైరాయిడ్ సర్జరీ



నెల్లూరు(అర్బన్): థైరాయిడ్ గడ్డతో పాటు కామెర్లు సోకి తెల్లరక్త కణాలు తగ్గిపోయి తీవ్ర అనారోగ్యానికి గురైన ఓ మహిళకు నారాయణ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద రూపాయి ఖర్చు లేకుండా అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడామని ఆ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం నారాయణ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మహీధర్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట హరీష్ శస్త్రచికిత్స వివరాలను వెల్లడించారు. బద్వేలుకు చెందిన రసూల్‌బీకి ఏడేళ్లగా థైరోటాక్సికోసిస్ అనే వ్యాధితో గొంతు కింద పెద్ద గడ్డ ఏర్పడిందని తెలిపారు. చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో వైద్యం చేయించుకుని తమ ఆస్పత్రికి రాగా అత్యంత రిస్క్ తీసుకుని 8 గంటల పాటు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడామని తెలిపారు. ఎండోక్రైనాలజీ డాక్టర్లు సునంద, కస్యప్, మత్తు డాక్టర్లు కృష్ణ చైతన్య, రజిత తదితరుల బృందంతో శస్త్ర చికిత్స పూర్తి చేశామన్నారు. ఆరోగ్యశ్రీ లేని వారికి నారాయణ ఆరోగ్యమస్తు పథకం ద్వారా ఉచిత వైద్య సేవలు దిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న వాహన వేలం

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వాడుకలో ఉన్న స్వరాజ్ మజ్దా 2008 మోడల్ వాహనాన్ని (ఏపీ13 ఎన్ 2797)ను ఈ నెల 7న వేలం వేయనున్నట్లు జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కే సదారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు ముందస్తుగా రూ.25వేలు ధరావత్తును జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి, నెల్లూరు వారి పేరున డిమాండ్ డ్రాఫ్టు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. డిమాండ్ డ్రాఫ్ట్‌ను ఈ నెల 6న సాయంత్రం 5 గంటలలోగా ఆడియో వీడియో సూపర్‌వైజర్‌కు అందజేసి తగిన రసీదు పొందాలని సూచించారు. వేలంలో వాహనాన్ని దక్కించుకున్న వారు అదే రోజు పూర్తి నగదుతో పాటు 18 శాతం జీఎస్టీ చెల్లించి స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 96184 32664 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నారీ సమ్మాన్‌కు దరఖాస్తుల ఆహ్వానం



నారీ సమ్మాన్ బ్రోచర్ల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) నెల్లూరు మహిళా విభాగం ఆధ్వర్యంలో నారీ సమ్మాన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జేసీఐ అలుమిని క్లబ్ అధ్యక్షుడు కోటా సత్యం, నెల్లూరు ఏంజిల్స్ కార్యదర్శి కే విశ్వమైత్రి తెలిపారు.ఇందుకు సంబంధించిన బ్రోచర్లను శనివారం సంతపేటలోని జేసీఐ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన 18 ఏళ్లు పైబడిన వారు నారీ సమ్మాన్‌కు అర్హులని తెలిపారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో ఈ నెల 11న సాయంత్రం 6గంటలకు జరిగే సభలో సన్మానించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్, సభ్యులు ఎం రమణ్, బిందుమాధవి, తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో బ్రాహ్మణ కర్మక్రతువుల భవన నిర్మాణం



బ్రాహ్మణ కర్మక్రతువుల భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు(బృందావనం): నగరంలోని బ్రాహ్మణుల విజ్ఞప్తి మేరకు రూ.40 లక్షలతో కాశీవిశ్వేశ్వర బ్రాహ్మణ కర్మక్రతువుల భవనాన్ని నిర్మించామని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని మినీబైపాస్‌రోడ్డులోని పీటీ రంగరాజన్ పెట్రోల్ బంక్ పక్కన నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర బ్రాహ్మణ కర్మక్రతువుల భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలోని బాలాజీనగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి బ్రాహ్మణులు అద్దె ఇళ్లలో పెద్దసంఖ్యలో నివసిస్తున్నారన్నారు. వారి కుటుంబ సభ్యులు ఎవరైనా మృతి చెందితే పార్థివ దేహాన్ని ఉంచేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో కర్మక్రతువుల భవనాన్ని నిర్మించాలని ఎంతో మందిని కోరడం జరిగిందన్నారు. 2019 ఎన్నికల తరువాత స్థానిక కార్పొరేటర్లు, బ్రాహ్మణ నాయకులు కర్మక్రతువుల భవనం అవసరాన్ని తన దృష్టికి తీసుకురాగా 8 నెలల క్రితం శంకుస్థాపన చేశామని తెలిపారు. బ్రాహ్మణ పెద్దల ఆలోచనల మేరకు కర్మక్రతువుల భవనాన్ని నిర్మించామన్నారు. త్వరలో ఫ్రీజర్ వంటి అన్ని సౌకర్యాలను సమకూరుస్తామన్నారు. నగర నియోజకవర్గం నుంచి సామాన్య కార్యకర్తకు అవకాశం కల్పించాలనే ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ తరుపున ఖలీల్‌అహ్మద్‌ను నియమించారని, బ్రాహ్మణలందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి,వైఎస్సార్‌సీపీ నాయకులు నేతాజీ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ బ్రాహ్మణుల అభీష్టం మేరకు కాశీ విశ్వేశ్వర బ్రాహ్మణ కర్మక్రతువుల భవనాన్ని నిర్మించి అందజేయడం అభినందనీయమని అఖిల బ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్రాధ్యక్షుడు అవధానం సాయికుమార్ తెలిపారు. బాలాజీనగర్‌లోని ఐక్యవేదిక జిల్లా శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో నగర ఎమ్మెల్యేకు బ్రాహ్మణ సంఘీయుల తరుపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. అఖిల బ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు మైలవరపు మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జంగా శ్రీనివాసకుమార్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సత్తెనపల్లి గిరిజ, ప్రధాన కార్యదర్శి రావూరి వరలక్ష్మి, సభ్యులు శ్రీకంఠ రఘుకిషోర్, ధరణికోట అనిల్‌కుమార్, మైలవరపు కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

పోలియో చుక్కలను తప్పక వేయించండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): ప్రతి ఒక్కరూ తమ చిన్నారులకు పోలియో చుక్కలను ఆదివారం తప్పక వేయించాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. పోలియో చుక్కల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్, డీఎల్‌ఓ డాక్టర్ సెలీనాతో కలిసి శనివారం ఆవిష్కరించారు. తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్లు, మొబైల్ రూట్ వాహనాల ద్వారా సైతం పోలియో చుక్కలను వేయనున్నారని చెప్పారు. డాక్టర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఆదాలకు మద్దతుగా విస్తృత ప్రచారం



17వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ పేనేటి సుధాకర్



25వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఏఎంసీ చైర్మన్ పేర్నేటి

నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి కోరారు. ఎంపీ ఆదాలకు మద్దతుగా 25వ డివిజన్‌లోని బుజబుజనెల్లూరు, న్యూకాలనీ, తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. రూరల్ నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగాలంటే ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షేక్ ఖాదర్‌బాషా, స్థానిక నాయకులు శ్రీహరియాదవ్, షఫీహుస్సేన్, మురళి, జహీర్, రాము, బీబీజాన్, మున్వర్, రవి, మల్లికార్జున, లక్ష్మమ్మ, ఖాదర్‌బాషా, మాధవి తదితరులు పాల్గొన్నారు. ఆదాలకు మద్దతుగా 17వ డివిజన్ పరిధిలోని వడ్డిపాళెంలో కార్పొరేటర్ పేనేటి సుధాకర్ ఇంటింటికి కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షపాతి అయిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకునేందుకు అభివృద్ధి ప్రదాత ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నాయకులు రమణయ్య, వంశీకృష్ణ, మస్తానయ్య, హరిబాబు, భాస్కర్, గోపీనాథ్, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.